# నేటి నిజం

website2:www.netinijam.com

హైదరాబాద్ శుక్రవారం 1-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:96 పేజీలు:6 వెల: రూ.1/-


## ఎగ్జిట్ పోల్స్ చూసి కంగారు పడొద్దు.. విజయం మనదే.. తేల్చి చెప్పిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 30: ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసి కంగారు పడాల్సిన పని లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు..

ఆయన మాటల్లోనే.. ' మళ్లీ అధికారం మాదే. హ్యాట్రిక్ కొడతాం. 70కి పైగా సీట్లు గెలుస్తాం. డిసెంబర్ 3న మళ్లీ అధికారం చేపడతాం. ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై కంగారు పడాల్సిన అవసరం లేదు. 2018లో వచ్చిన ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు తప్పని తేలాయి. చాలా మంది ఓటింగ్ కోసం క్యూ లైన్లలో నిలుచుని ఉన్నారు. కేసీఆరే మళ్లీ సీఎం అవుతారు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## ఓ పౌరుడిలా నా బాధ్యతను నిర్వర్తించాను : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 30: లంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు మొదలైంది. దీంతో ప్రజలు, సినీ రాజకీయ ప్రముఖులు ఓటు వేసేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ నేపథ్యంలోనే భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మంత్రి కేటీఆర్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. బంజారాహిల్స్ నందినగర్ లో గల ఓ పోలింగ్ బూత్‌లో భార్యతో కలిసి ఓటు వేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లేవాళ్లకే ఓటు వేశానని తెలిపారు. 'తెలంగాణ పౌరుడిగా ఓటు హక్కు వినియోగించుకుని నా బాధ్యత నెరవేర్చా. అభివృద్ధి కోసం పాటు పడే పార్టీకి, ఒక మంచి నాయకుడికి ఓటు వేశా. తెలంగాణలో ఓటు ఉన్న పౌరులంతా ముందుకొచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ముఖ్యంగా పట్టణ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఓటు వేయండి. ఓటు వేసి మీ హక్కును కాపాడుకోండి' అంటూ కేటీఆర్ పిలుపునిచ్చారు.

## నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 4గంటలకు ముగిసిన పోలింగ్

హైదరాబాద్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కొనసాగ ంది. అయితే నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 4గంటలకు పోలింగ్ ముగిసింది. మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాలైన సిర్పూర్, చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల, ములుగు, పినపాక, ఇల్లందు, కొత్తగూడెం, ఆసిఫాబాద్, అశ్వారావుపేట, భద్రాచలంలో పోలింగ్ ముగిసింది. అలాగే మరో గంటలో తెలంగాణ వ్యాప్తంగా పోలింగ్ ముగియనుంది. 5గంటల లోపు పోలింగ్ స్టేషన్ల వద్ద ఉన్న క్యూలో ఉన్న వారికి మాత్రమే ఓటు వేసే అవకాశం ఉటుందని అధికారులు తెలిపారు. ఓటింగ్ గడువు సమయం సమీపిస్తుండడంతో పలు ప్రాంతల్లో ఓటర్లు బారులుతీరారు. మరో వైపు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చెదురుమదురు సంఘటనల మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మధ్యాహ్నం 3గంటల వరకు 58.38 శాతం పోలింగ్ నమోదైంది. అలాగే కొత్తగూడెం నియోజకవర్గంలో 49.7 శాతం, భద్రాచలం నియోజకవర్గంలో 63శాతం, పినపాక నియోజకవర్గంలో 63 శాతం, ఇల్లందు నియోజకవర్గంలో 56.9 శాతం, అశ్వారావుపేట నియోజకవర్గంలో 63.75శాతం పోలింగ్ నమోదైంది. అదేవిధంగా మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి నియోజకవర్గంలో 64శాతం, చెన్నూరులో 60.7శాతం, మంచిర్యాలలో 54.36శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

## చింతమడకలో ఓటేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు



హైదరాబాద్, నవంబర్ 30:తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఓటు వేశారు. సిద్దిపేట జిల్లాలోని చింతమడక గ్రామంలో సతీమణి శోభతో కలిసి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామంలోని 13వ పోలింగ్ కేంద్రంలో సీఎం దంపతులు ఓటు వేశారు. సీఎంకు చింతమడక గ్రామం ఒక సెంటిమెంట్. సీఎం దంపతులు చింతమడకకు వెళ్తుండటంతో అక్కడ భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఓట్ల లిస్టులో కేసీఆర్ సీరియల్ నెంబర్ 158గా ఉంది. ఓటరు కార్డు సంఖ్య SAG 0399691గా ఉంది. సీఎం సతీమణి శోభమ్మ సీరియల్ నంబర్ 159, ఓటరు కార్డు నంబర్ SAG 0761676గా ఉంది.

## ప్రశాంతంగా ఎన్నికలు..హర్షం వ్యక్తం చేసిన ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్

హైదరాబాద్ నవంబర్ 30 , (దక్షిణాది ) : తెలంగాణా శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంపై ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. ఎన్నికల నిర్వహణలో భారత ఎన్నికల కమిషన్ అద్భుతమైన పాత్ర పోషించిందని, పోలీస్ శాఖ కూడా ఎన్నికలు నిర్వహణలో స్ఫూర్తిదాయక కృషి చేసిందని కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య గురువారం ఒక ప్రకటనలో కొనియాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ కూడా చెప్పుకోదగ్గ సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవడం అభినందనీయమని ఆయన ఎన్నిక సీఈఓ, డీజీపీ నిరంతర కృషి చేయడం, ప్రజలు కూడా చక్కగా సహకరించడం రానున్న రోజుల్లో మరింత మార్పు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేసారు. కాగా గురువారం కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య అంబర్పేట నియోజకవర్గం లోని నల్లకుంటలో తన సతీమణితో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## సతీసమేతంగా సిద్దిపేటలో ఓటేసిన మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్, నవంబర్ 30:తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. గురువారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్.. సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగనుంది. ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈ నేపథ్యంలో మంత్రి హరీశ్‌రావు కుటుంబ సభ్యులతో కలిసి సిద్దిపేటలో ఓటు వేశారు. భార్య శ్రీనిత, తనయుడు అర్చిస్ మాన్‌తో కలిసి వచ్చిన మంత్రి ఓటు వేసి.. ప్రజలంతా ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

మరోవైపు ఉదయం 11 గంటల వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 20.64 శాతం మేర పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 30.65 శాతం పోలింగ్ నమోదుకాగా.. అత్యల్పంగా హైదరాబాద్‌లో 12.39 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు.

## కెనడాలో వైభవంగా కార్తిక పౌర్ణమి శ్రీచక్ర పూజలు



హైదరాబాద్, నవంబర్ 30: కార్తిక పౌర్ణమి సందర్భంగా కెనడా మిస్సిసౌగాలో కార్తిక పౌర్ణమి శ్రీచక్ర పూజలను వైభవంగా నిర్వహించారు. కెనడాలోని మిస్సిసౌగా, టొరంటో, బ్రాంప్టన్, మిల్టన్, స్కార్‌బరో తదితర నగరాల్లో ఉన్న తెలుగు ప్రజలు ఈ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్ సహాయ సహకారాలతో, జీఆర్డీ లేయర్స్ గుర్‌కుల్ ఆధ్వర్యంలో సహస్ర సువాసిని పూజ, సమిష్టి శ్రీ చక్ర పూజ, సహస్ర లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెయ్యి మంది పైగా మహిళలు పాల్గొన్నారు. అమృత చైతన్య మండలి నుంచి 40 మంది శ్రీవిద్యా ఉపాసకులు చేసిన శ్రీచక్ర పూజ ఎంతగానో అలరించింది. ఈ పూజలో 2500 చదరపు అడుగుల శ్రీచక్ర యంత్రాన్ని నేలపై రంగురంగుల చీరలు, పుష్పాలతో అందంగా అలంకరించారు.

జీఆర్డీ లేయర్స్ గుర్‌కూల్ వ్యవస్థాపకులు రమేష్ నటరాజన్, ఆయన సతీమణి గాయత్రీ నటరాజన్ మాట్లాడుతూ ఉత్తర అమెరికాలోని కెనెడాలో వినూత్నంగా శ్రీ చక్రపూజలు నిర్వహించడం ఇదే ప్రథమమని అన్నారు. నాటా సహకారంతో సనాతన ధర్మాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. నాటా అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి కొరసపాటి మాట్లాడుతూ కెనడా తెలుగు ఆడపడుచుల ఉత్తేజానికి జోహార్లని, భవిష్యత్తులో కెనడాలో మరింత వైవిధ్యమైన కార్యక్రమాల నిర్వహణకు నాటా కృషి చేస్తుందని తెలిపారు.

## కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు.. మంటల్లో కాలి ఏడుగురు కార్మికులు మృతి

అహ్మదాబాద్: కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగింది. మంటల్లో కాలి ఏడుగురు కార్మికులు సజీవ దహనమయ్యారు. మరో 27 మంది కార్మికులకు కాలిన గాయాలయ్యాయి. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. ఏథర్ ఇండస్ట్రీస్‌లో బుధవారం తెల్లవారుజామున కెమికల్ స్టోరేజీ ట్యాంకులో మంటలు చెలరేగాయి. దీంతో భారీగా పేలుడు సంభవించింది. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికులు పదుల సంఖ్యలో గాయపడ్డారు. మరికొందరు అదృశ్యమయ్యారు.

కాగా, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చిన తర్వాత అదృశ్యమైన కార్మికుల కోసం గురువారం వెతికారు. ఈ నేపథ్యంలో ఏడుగురు కార్మికులు కాలి బూడిదిగా మారినట్లు గుర్తించారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు, ఫైర్ అధికారులు తెలిపారు. గుజరాత్‌లోని అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తల్లో ఒకరు, 1.3 మిలియన్ డాలర్ల సంపద ఉన్న అశ్విన్ దేశాయ్‌కు చెందిన కంపెనీగా సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## తెలంగాణ ఎన్నికలపై ఎగ్జిట్ పోల్స్

హైదరాబాద్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);తెలంగాణతో సహా ఐదు రాష్ట్రాల్లో అలా పోలింగ్ ముగిసిందో లేదో.. ఇలా ఎగ్జిట్ పోల్స్ వచ్చేశాయ్. ఇప్పటికే.. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంలో పోలింగ్ ముగియగా.. తెలంగాణలో నవంబర్-30న పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగియగానే జనాలంతా ఏ పార్టీ అధికారంలోకి రాబోతోంది.. ప్రజలు ఎవరికి పట్టం కట్టబోతున్నారని చెప్పే ఎగ్జిట్ పోల్స్ కోసం టీవీలకు.. గూగుల్‌కు అతుక్కుపోయారు...

| పోల్ ట్రెండ్స్ అండ్ స్ట్రాటజీస్ | చాణక్య స్ట్రాటజీస్ | సీ-ప్యాక్ | ఆరా |
|---|---|---|---|
| కాంగ్రెస్ 65-68 | కాంగ్రెస్ : 67-78 | కాంగ్రెస్ : 65 | బీఆర్ఎస్ : 41-49 |
| బీఆర్ఎస్ 35-40 | ఆర్ఎస్ 22-31 | ఆర్ఎస్ : 41 | కాంగ్రెస్ : 58-67 |
| బీజేపీ 7-10 | బీజేపీ : 6-9 | బీజేపీ : 04 | బీజేపీ : 5-7 |
| ఇతరులు 6-9 | ఎంఐఎం : 6-7 | ఇతరులు : 09 | ఇతరులు : 7-9 |

## ముగిసిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్

హైదరాబాద్, నవంబర్ 30: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిసింది . రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. 5 గంటల లోపు క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటేసేందుకు అధికారులు అనుమతిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చితమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు. ఫలితంగా సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసేసరికి 63.94 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు.

నేడు రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రజాస్వామ్య పండుగలో సాధారణ ఓటర్లతో పాటు సెలబ్రిటీలూ ఓటేసేందుకు పోటెత్తారు. సాధారణ పౌరుల్లా క్యూలో నిల్చొని మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 2,290 మంది అభ్యర్థులు బరిలో నిలువగా.. 3,26,18,205 మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

మ్రొక్కినచో- కర్తవ్యము
గ్రక్కున వివరించగ నగరమునకు నడుమన్
నిక్కముగ బుద్ధదేవుడు
చక్కగ నిలచెను హుసేను సాగరు లోనన్

( 1-12-1992 హుసేన్ సాగర్ లో బుద్ధవిగ్రహం ప్రతిష్ట)



-రాధశ్రీ
సెల్:9494481210

## హరిత వర్ణంలోకి పాలరాతి కట్టడం.. రంగు మారుతున్న తాజ్ మహల్

హైదరాబాద్, నవంబర్ 30: ప్రపంచపు ఏడు వింతల్లో ఒకటిగా ఉన్న తాజ్ మహల్ పాలరాతి కట్టడమన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన పన్లేదు. పాలపుంతను గుర్తు చేసినట్టుగా తెలుపు వర్ణంలో మెరిసిపోయే ఈ షాజహాన్ ప్రేమ కట్టడం రంగు మారుతోంది. తెలుపు వర్ణం కాస్తా ఆకుపచ్చ రంగులోకి మారుతుండటం ఆందోళనకు గురిచేస్తున్నది. అయితే తాజ్ మహల్ హరిత రూపును సంతరించుకోవడం ఇదే మొదటిసారి కాకపోయినా నవంబర్ మాసంలో హరిత వర్ణంలోకి మారుతుండటంపై పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పురావస్తు శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తాజ్ మహల్ లోని యమునా నది తీరం వైపునకు ఉన్న కొంత కట్టడం ఆకుపచ్చగా మారుతోంది. ఇది 2015 నుంచి ప్రతి ఏడాది జరుగుతున్న ప్రక్రియనే. అయితే యేటా మాత్రం జూన్‌లో ఒకసారి ఇలా జరిగాక మళ్లీ శీతాకాలం మొదలయ్యాక ఇలా అవుతుండటానికి గల ఆందోళనకు గురిచేస్తున్నది అని ఆగ్రా సర్కిల్‌కు చెందిన సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్టు రాజ్ కుమార్ తెలిపారు. తాజ్ మహల్ గోడలు



ఇలా రంగు మారడానికి కారణం ఒక కీటకం అని ఓ అధ్యయనంలో తేలింది. గోయెల్డిచిరోనోమస్ అనే ఓ పురుగు దీనికి ప్రధాన కారణమని 2016లో ఆగ్రాకు చెందిన సెయింట్ జాన్స్ కాలేజ్, స్కూల్ ఆఫ్ ఎనటామోలాజీ విభాగంలో పనిచేసే డాక్టర్ గిరీష్ మహేశ్వరి తేల్చి చెప్పారు. గోయెల్డిచిరోనోమస్ యమునా నదిలో ఉండే నాచును తిని తాజ్ మహల్ గోడలపై అది విసర్జిస్తాయి. వాటి శరీరంలో ఉండే క్లోరోఫిల్ వల్ల అవి పాలరాయిపై ఆకుపచ్చ మరకలా కనిపిస్తుంది.. అని తన నివేదికలో వెల్లడించింది. ఈ కీటకాలకు తెల్లని పాలరాయికి ఆకర్షితమయ్యే గుణం ఉందని ఆమె తన నివేదికలో పేర్కొన్నారు. అయితే సాధారణంగా గడిచిన ఏడేనిమిదేండ్లుగా ఇవి జూన్-జులైలో జరుగుతుండగా ఇప్పుడు నవంబర్‌లో తాజ్ మహల్ రంగు మారుతుండటం ఆందోళనకు గురిచేస్తున్నది.




# చికిత్స లేని హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు నివారణే మార్గం !

(01 డిసెంబర్ "ప్రపంచ ఏయిడ్స్ దినం" సందర్భంగా)

విపత్తుల విజృంభనతో నిన్న స్తంభించిన మానవాళి నేడు వాతావరణ ప్రతికూల మార్పులు, పెరిగిన ద్రవ్యోల్బణంతో విశ్వ మానవాళి భయపడుతున్న వేళ మరో నివురు కప్పిన నిప్పు లాంటి ప్రాణాంతక హెచ్‌ఐవి/ఏయిడ్స్ అంటువ్యాధి చాప కింద నీరులా వ్యాపిస్తూ ప్రజలను భయపెడుతోంది. హెఐవి1, హెచ్‌ఐవి2 వైరస్‌లు జంతువుల నుండి మనుషులకు సంక్రమిస్తున్నాయి. 5 జూన్ 1981న తొలిసారి అమెరికాలో ఐదు హెచ్‌ఐవి/ఏయిడ్స్ కేసుల గుర్తించారు. ఇండియాలో తొలి హెచ్‌ఐవి/ఏయిడ్స్ కేసుగా 1986లో చెన్నైలో మహిళా సెక్స్ వర్కర్‌ను గుర్తించారు.

## భారత్‌లో హెచ్‌ఐవి – ఏయిడ్స్:

గత నాలుగు దశాబ్దాలకు పైగా ప్రపంచవ్యాప్తంగా వ్యాపించిన హుమన్ ఇమ్యూనో–డెఫిషియెన్సీ వైరస్ (హెచ్‌ఐవి) సోకిన కారణంగా సంక్రమించే ఏయిడ్స్ వ్యాధితో 37.6 మిలియన్ల బాధపడడం (35.9 మిలియన్ల పెద్దలు, 1.7 మిలియన్ల 15–ఏండ్ల లోపు పిల్లలు), 40 మిలియన్ల ప్రజలు మరణించడం ఇప్పటి వరకు జరిగి పోయింది. 2020 ఏడాదిలో 1.5 మిలియన్ల ప్రజలకు హెచ్‌ఐవి సోకిందని అంచనా. 2010 వివరాలతో పోల్చితే 2020లో 30 శాతం తక్కువ కేసులు బయట పడ్డాయి. ప్రతి యేటా ఏయిడ్స్ వ్యాధితో 2 మిలియన్ల ప్రజలు, అందులో 2.5 లక్షల పిల్లలు ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. ప్రస్తుతం ఏడాదికి 63,000 కొత్త హెచ్‌ఐవి సోకిన కేసులు, 42,000 మరణాలు నమోదు అవుతున్నట్లు 2021 గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. దాదాపు 24 లక్షల మంది హెచ్‌ఐవి సోకిన వ్యక్తులు మన దేశంలో ఉన్నారు. భారత్‌లో దక్షిణాది రాష్ట్రాల్లో (మహారాష్ట్ర, ఆంధ్ర, కర్నాటక లాంటి) అధిక కేసులు బయట పడుతున్నాయి.

## నిశ్శబ్దాన్ని వీడుదాం-ఏయిడ్స్ గూర్చి చర్చిద్దాం:

నేటికీ ఎలాంటి ప్రత్యేక మందు, చికిత్స, వ్యాక్సీన్ కూడా అందుబాటులో లేని కారణంగా సంపూర్ణ అవగాహన, జీవనశైలిలో మార్పులు, నిశ్శబ్దాన్ని వీడి సామాన్యుల నడుమ విస్తృత చర్చలు, ముందు జాగ్రత్తలు తీసుకోవడం మాత్రమే మన ముందున్న ఏకైక మార్గంగా కనిపిస్తున్నది. హెచ్‌ఐవి వైరస్ సోకిన వ్యక్తి రక్తంతో పాటు శరీర ద్రవాల్లో వైరస్ మనగలుగుతుందనే విషయాన్ని అందరికీ చేరేలా అవగాహన కల్పించారు. వైరస్ సోకిన వ్యక్తుల్లో 84 శాతం మాత్రమే నిర్ధారణ చేయబడ్డాయని, అందులో 73 శాతానికి పైగా ఆంటీ–రెట్రో వైరల్ థెరపీ తీసుకున్నారని, 66 శాతం చికిత్సకు సానుకూలంగా స్పందించారని 2020 ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

## హెచ్‌ఐవి-ఏయిడ్స్ దినం-2023:

హెచ్‌ఐవి వైరస్ కారణంగా సంక్రమించే "అర్జిత వ్యాధి నిరోధకత లోపంతో కలిగే బహువ్యాధి లక్షణాన్ని ఏయిడ్స్ (అక్వైర్డ్ ఇమ్యూనో డెఫిసియన్సీ సిండ్రోమ్) వ్యాధి" అంటున్నాం. భయంకరమైన ప్రాణాంతక హెచ్‌ఐవి/ఏయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రతియేటా 01 డిసెంబర్ రోజున 1988 నుంచి విశ్వవ్యాప్తంగా 'ప్రపంచ ఏయిడ్స్ దినం' నిర్వహిస్తున్నాం. ఎరుపు రంగు రిబ్బన్‌ను సూచికగా తీసుకొని హెచ్‌ఐవి/ఏయిడ్స్ వ్యాధిగ్రస్తులకు సంఘీభావం తెలుపడం, రక్తం, వ్యాధి పట్ల హెచ్చరిక, సోకిన వారి పట్ల ప్రేమ, సహనం ప్రకటించుట జరుగుతోంది. ప్రపంచ ఏయిడ్స్ దినం–2023సందర్భంగా 'గ్లోబల్ సాలిడారిటీ, షేర్డ్ రెస్పాన్సిబుటీ' లేదా 'విశ్వ సంఘీభావం, భాద్యతలు పంచుకోవడం' అనే నినాదాన్ని తీసుకున్నారు.

## హెచ్‌ఐవి-ఏయిడ్స్ వ్యాప్తికి కారణాలు:

హెచ్‌ఐవి వైరస్ సోకిన వ్యక్తి రక్తం ఆరోగ్యవంతుడి రక్తంతో కలిసే అవకాశం ఉన్నపుడే హెచ్‌ఐవి సంక్రమిస్తుంది. అసురక్షిత లైంగిక సంబంధాలే వైరస్ వ్యాప్తికి ప్రధాన కారణమని గుర్తుంచుకోవాలి. శుద్ధి చేయని సూదులతో పచ్చబొట్లు, ఒకే రేజర్ బ్లేడ్లను ఇద్దరు వాడడం, అజాగ్రత్తగా రక్త మార్పిడి, అపరిశుభ్ర సిరంజ్, సూదుల ద్వారా వైరస్ సంక్రమించవచ్చు. హెచ్‌ఐవి సోకిన మహిళ బిడ్డకు జన్మనిచ్చినపుడు, శరీర ద్రవాలు కలిసినపుడు, ప్రసూతి సమయంలో, రొమ్ము పాలు పట్టినపుడు శిశువుకు హెచ్‌ఐవి సోకవచ్చు. ఇండియాలో అసురక్షిత లైంగిక సంబంధాలతో 85.6 శాతం, తల్లి నుండి శిశువుకు 5.9 శాతం, స్వలింగ సంపర్కంతో 1.4 శాతం, రక్తమార్పిడితో 1.1 శాతం, అపరిశుభ్ర సూదులతో 1.3 శాతం మందికి హెచ్‌ఐవి వైరస్ సోకుతోందని తెలుస్తున్నది. లాలాజలం, చెమట, మూత్రంలో అత్యల్ప పరిమాణంలో హెచ్‌ఐవి వైరస్ ఉన్నందున వీటి ద్వారా ఇతరులకు వ్యాపించే అవకాశం దాదాపు ఉండదు.

## హెచ్‌ఐవి-ఏయిడ్స్ వ్యాధి లక్షణాలు:

ప్రాథమిక హెచ్‌ఐవి దశలో రోగలక్షణాలు కనిపించవు. తరువాత స్టేజ్1 నుండి స్టేజ్4 వరకు రోగం ముదిరి ప్రాణం కూడా పోతుంది. హెచ్‌ఐవి సోకిన వ్యక్తిలో తొలుత ఎలాంటి రోగ లక్షణాలు కనిపించక పోవచ్చు లేదా మరి కొన్ని సమయాల్లో జ్వరం, డయేరియా, కీళ్ళ నొప్పులు, గొంతు మరియు ఒంటి నొప్పులు, బరువు తగ్గడం, టి–లింఫోసైట్స్ ప్రభావితం కావడం, శోషరస గ్రంథుల వాపు లాంటి రోగ లక్షణాలు రావచ్చు. హెచ్‌ఐవి సోకిన వ్యక్తిలో రోగనిరోధక శక్తి బలహీనపడుతూ రక్తంలో సిడి4 కణాల సంఖ్య తగ్గుతుంది. ఈ స్థితిలో ఏయిడ్స్ రోగికి టిబి, న్యుమేనియా లాంటి బహువ్యాధి లక్షణాలు కలుగవచ్చు.

## హెచ్‌ఐవి-ఏయిడ్స్ చికిత్సలు:

హెచ్‌ఐవి/ఏయిడ్స్ వ్యాధికి ఎలాంటి సరైన ఔషధ చికిత్స లేదు, కాని ఆంటీ–రెట్రో వైరల్ థెరపీ (ఏఆర్‌టి) చికిత్స ద్వారా వైరస్ పునరుత్పత్తి రేటును (రెప్లికేట్) తగ్గించవచ్చని తెలుస్తున్నది. హెచ్‌ఐవి సోకిన వ్యక్తి జీవనశైలి మార్పులతో కనీసం 10 సంవత్సరాలకు పైగా ఆరోగ్యంగా బతకవచ్చు. హెచ్‌ఐవి/ఏయిడ్స్ నిర్థారణ పరీక్షల్లో రాపిడ్, ఎలీసా, పిసిఆర్ లాంటి ఆంటీబాడీ మరియు ఆంటిజెన్ పరీక్షలు నిర్వహిస్తారు.

## హెచ్‌ఐవి-ఏయిడ్స్ నివారణ మార్గాలు:

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పేదరికం, అవిద్య, అసమానతలు, అధిక జనాభా వంటి కారణాలే హెచ్‌ఐవి-ఏయిడ్స్‌కు ప్రధాన కారణాలని నిపుణుల నిర్థారణకు వచ్చారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, న్యాయ అసమానతలను తగ్గిస్తేనే ఏయిడ్స్, కరోనా లాంటి ప్రజారోగ్య సమస్యలు సమసి పోతాయి. 2030 నాటికి హెచ్‌ఐవి–ఏయడ్స్‌కు చరమగీతం పాడాలని ఐరాస లక్ష్యంగా పెట్టుకుంది. ప్రజారోగ్య వసతుల కల్పన, ఔషధాల అందుబాటు, వైరస్ నిర్థారణ సౌకర్యాలు, నిశ్శబ్దాన్ని వీడి అందరికీ అవగాహన కార్యక్రమాల నిర్వహణ, ఏయిడ్స్ రోగులకు సామాజిక భరోసా లాంటి చర్యలు తీసుకోవాలి. హెచ్‌ఐవి/ఏయిడ్స్ నివారణ పట్ల అవగాహన కల్పించడం, డిస్పోసబుల్ సూదులు, బ్లేడులు వాడడం, సురక్షిత (కండోమ్‌లు వాడడం) లైంగిక సంబంధాలు, వేశ్యలు/అపరిచితులతో లైంగిక సంబంధాలు పెట్టుకోకపోవడం, హెచ్‌ఐవి పాజిటివ్ గర్భిణి మహిళకు ప్రసూతి వరకు తగు వైద్య సూచనలు అందించడం, పరీక్షించిన తరువాతనే రక్తమార్పిడి చేయించుకోవడం లాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలి.

చికిత్సతో పాటు టీకాలు అందుబాటులో లేని హెచ్‌ఐవి/ఏయిడ్స్ వ్యాధికి నివారణ ఒక్కటే ఏకైక మార్గమని, సీతారాముల జీవితాలే మనకు ఆదర్శమని, సంపూర్ణ అవగాహన కలిగి, తగు జాగ్రత్తలతో ఆరోగ్యకర జీవితాన్ని ఆస్వాదిద్దాం. విశ్వ సంఘీభావం, సమాజి చర్చలు, బాధ్యతలను పంచుకోవడమనే లక్ష్యంతో ఏయిడ్స్ వ్యాధిని నివారించవచ్చని అందరూ నమ్మినపుడే హెచ్‌ఐవి–ఏయిడ్స్ లేని సమాజ స్థాపన సుసాధ్యం అవుతుంది. హెచ్‌ఐవీ వైరస్ మహమ్మారిని మన దరికి రాకుండా అడ్డుకుందాం. చికిత్స కన్న నివారణే మిన్న అని నమ్ముదాం. హెచ్‌ఐవి–ఏయిడ్స్ వ్యాధికి సరైన టీకా సత్వరమే రావాలని కోరుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# ఉత్తరాఖండ్ ఆపరేషన్‌లో శ్రీసిటీలోని బి-రోలెక్స్ భాగస్వామ్యం



నెల్లూరు, నవంబర్ 30: ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారీ సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను సురక్షితంగా కాపాడిన ఆపరేషన్ లో తిరుపతి జిల్లా శ్రీ సిటీ కి చెందిన ఒక పరిశ్రమ కీలక భాగస్వామ్యం వహించింది. చిక్కుకున్న వారిని రక్షించే దశలో నవంబర్ 25న డ్రిల్లింగ్ యంత్రం విరిగి ముందుకు కదలక సిబ్బంది పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. తగు పరిష్కారం కోసం పర్యవేక్షక అధికారులు డి ఆర్ డి ఓ మాజీ ఛైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డిని కోరగా, ఆయన వివిధ నిపుణుల ఏజెన్సీలను సంప్రదించారు. ఆయన పిలుపునకు శ్రీసిటీ లోని బి–రోలెక్స్ పరిశ్రమ స్పందించింది. ఆ పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ వై.శ్రీనివాస్ రెడ్డి, డ్రిల్లింగ్ కు పరిష్కార మార్గంగా ప్లాస్మా ఆధారిత కట్టింగ్‌ను అత్యంత ప్రభావవంతమైన పద్ధతిగా ప్రతిపాదించారు. అలాగే మూడు గంటల వ్యవధిలోనే రెండు పోర్టబుల్ ప్లాస్మా కట్టింగ్ మెషీన్‌లను బి–రోలెక్స్ సిద్ధం చేసింది. వీటితో పాటు, ప్లాస్మా కట్టర్లను వినియోగించే పరిశ్రమకు చెందిన ముగ్గురు సభ్యుల నిపుణుల బృందాన్ని (సంతోష్ కుమార్, అజయ్ షా, నాగరాజు) ఘటన స్థలానికి పంపారు. ప్లాస్మా కట్టర్‌లతో పాటు నిపుణుల బృందాన్ని పంపడానికి ప్రభుత్వం ప్రత్యేక ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానాన్ని ఏర్పాటు చేసింది.

విజయవంతంగా కట్టర్ నిపుణులు పైప్‌లైన్‌ను సిద్ధం చేసి, కొన్ని గంటల వ్యవధిలో సహాయక చర్యలకు అడ్డుపడిన యంత్రపు ముక్కలను తొలగించారు. బి–రోలెక్స్ సమకూర్చిన ప్లాస్మా కట్టింగ్ మెషీన్ లు, సహాయక చర్యల్లో ముఖ్యమైన అడ్డంకిని అధిగమించడంలో, 800 మిమీ వ్యాసం కలిగిన పైపును ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించింది. సహాయక చర్యలు పర్యవేక్షించిన భాస్కర్ కుల్బే, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఇతర సీనియర్ అధికారులు వేగంగా స్పందించి సాయమందించిన శ్రీనివాస్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వేగంగా స్పందించి సహాయక చర్యలకు నిపుణుల బృందాన్ని పంపిన బి–రోలెక్స్ పరిశ్రమ శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబంలో భాగం కావడం గర్వంగా ఉందని పేర్కొన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ని అభినందించారు.

# భారత జి20 అధ్యక్షత నవ్య బహుపాక్షికత: రేపటి ఉజ్వల భవితవైపు దిశానిర్దేశం

న్యూఢిల్లీ, నవంబర్ 30: భారతదేశం జి20 అధ్యక్ష బాధ్యతలు చేపట్టి నేటితో 365 రోజులు పూర్తయ్యాయి. "వసుధైవ కుటుంబకం"... అంటే– 'ఒకే భూమి–ఒకే కుటుంబం–ఒకే భవిష్యత్తు' స్ఫూర్తిని చాటేలా పునరంకి తమవుతూ.. పునరుజ్జీవనానికి బీజం వేసిన క్షణమది.

మనం నిరుడు ఈ బాధ్యత స్వీకరించే నాటికి యావత్ ప్రపంచం బహుముఖ సవాళ్లతో సతమతం అవుతోంది. ఆ మేరకు క్షీణిస్తున్న బహుపాక్షికత నడుమ కోవిడ్–19 మహమ్మారి దుష్ప్రభావం నుంచి కోలుకోవడం, నానాటికీ పెరుగుతున్న వాతావరణ మార్పు సమస్యలు, ఆర్థిక అస్థిరత, వర్ధమాన దేశాల్లో రుణభారం తదితరాలన్నీ చోటు చేసుకున్నాయి. అలాగే ఘర్షణలు, వివాదాలు, స్పర్థాత్మకతల మధ్య ప్రగతి సంబంధిత సహకార భావన దెబ్బతిని, పురోగమనం కుంటుపడింది.

ఈ నేపథ్యంలో జి20 నాయకత్వ బాధ్యతలు స్వీకరించిన భారతదేశం ఆనాటి దుస్థితి నుంచి ప్రపంచాన్ని గట్టెక్కించి, ప్రత్యామ్నాయం చూపాలని నిశ్చయించుకుంది. ఇందులో భాగంగా జిడిపి కేంద్రక ప్రగతి నుంచి మానవ–కేంద్రక పురోగమనంవైపు మళ్లాల్సిన అవసరాన్ని స్పష్టం చేసింది. మనమధ్య విభజన తెస్తున్న కారణాన్ని కాకుండా మనల్ని ఏది ఏకం చేయగలదో దానిగురించి గుర్తుచేయడం లక్ష్యంగా నిర్దేశించుకుంది. దీంతో అంతిమంగా అంతర్జాతీయ చర్చలు పరిణామశీలమై– కొందరి స్వార్థానికి కాకుండా అందరి ఆకాంక్షలు, ప్రయోజనాలకు పెద్దపీట వేయక తప్పలేదు. అయితే, ఇందుకోసం ముఖ్యంగా చేయాల్సిందల్లా బహుపాక్షికతలో మూలాల నుంచి సంస్కరణలు తేవడం.

"సార్వజనీనత, ఆకాంక్షాత్మకత, కార్యాచరణాత్మకత, నిర్ణయాత్మతకత" అనే నాలుగు పదాలు జి20 అధ్యక్ష బాధ్యతల నిర్వహణలో మన విధానమేమిటో సుస్పష్టంగా నిర్వచించాయి. అటుపైన జి20 సభ్యదేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించిన 'న్యూఢిల్లీ దేశాధినేతల తీర్మానం' (ఎన్డీఎల్డీ) ఈ సూత్రాల అమలులో మన నిబద్ధతను ప్రస్ఫుటం చేసింది.

సార్వజనీనత అన్నది మన అధ్యక్ష పదవికి ఆత్మవంటిది. దీనికి అనుగుణంగా ఆఫ్రికా సమాఖ్య (ఎయు)కు జి20లో శాశ్వత సభ్యత్వం కల్పించడం ద్వారా 55 ఆఫ్రికా దేశాలను ఈ వేదికమీదకు చేర్చాం. దీంతో ప్రపంచ జనాభాలో 80 శాతానికి ప్రాతినిధ్యం వహించే విధంగా జి20 విస్తరించింది. తద్వారా అంతర్జాతీయ సవాళు–అవకాశాలపై మరింత సమగ్ర చర్చలను ఈ క్రియాశీల వైఖరి ప్రోత్సహించింది.

ఇక 'దక్షిణార్ధ గోళం దేశాల గళం' పేరిట భారతదేశం తొలిసారి రెండు దఫాలుగా నిర్వహించిన శిఖరాగ్ర సదస్సు బహుపాక్షికత నవోదయానికి శుభారంభం పలికింది. ఆ విధంగా దక్షిణార్ధ గోళ దేశాల సమస్యలను భారతదేశం అంతర్జాతీయ చర్చల ప్రధాన స్రవంతిలోకి తెచ్చింది. తద్వారా ప్రపంచ ప్రగతికి మార్గ ప్రణాళికలో వర్ధమాన దేశాలు తమవంతు ప్రాతినిధ్యం వహించే కొత్త శకానికి నాంది పలికింది.

సార్వజనీనత అన్నది భారత దేశీయ విధాన ఉత్తేజాన్ని జి20కి వ్యాపింపజేసింది. ఆ మేరకు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి తగినట్లుగా జి20కి భారత నాయకత్వం ప్రజాధ్యక్షతగా రూపొందింది. ఈ మేరకు "ప్రజా భాగస్వామ్యం" కింద నిర్వహించిన అనేక కార్యక్రమాల ద్వారా 140 కోట్ల మంది పౌరులకు జి20 చేరువైంది. ఇందులో అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకూ భాగస్వామ్యం ఇవ్వబడింది. అలాగే జి20 నిర్దేశాలకు అనువుగా వాస్తవిక అంశాలపై అంతర్జాతీయ దృష్టిని విస్తృత ప్రగతి లక్ష్యాల వైపు మళ్లించేలా భారత్ బాధ్యత వహించింది.

ప్రపంచం సాధించాల్సిన లక్ష్యాలపై 2030 నాటి గడువుకు నేడు మనం అత్యంత కీలకమైన మధ్యకాలంలో ఉన్నాం. అందువల్ల 2023కు సంబంధించి జి20 కార్యాచరణ ప్రణాళికను భారత్ రూపొందించింది. ఇది సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ)ను వేగవంతం చేయడంతోపాటు ఆరోగ్యం, విద్య, లింగ సమానత్వం, పర్యావరణ సమతౌల్యం, పరస్పర అనుసంధానిత సమస్యల పరిష్కారం కోసం విస్తృత కార్యాచరణ–ఆధారిత విధానం వగైరాలను సూచించింది.

ఈ ప్రగతి ప్రణాళిక పురోగమనానికి జనహిత మౌలిక సదుపాయాలు (డిపిఐ) అత్యంత కీలకం. ఆ మేరకు 'ఆధార్, యుపిఐ, డిజిలాకర్' వంటి డిజిటల్ ఆవిష్కరణల విప్లవాత్మక ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూసిన భారత్ తనవంతుగా నిర్ణయాత్మక సిఫారసులు చేసింది. జి20 ద్వారా మనం జనహిత మౌలిక సదుపాయాల భాండాగారం ఏర్పాటును విజయవంతంగా పూర్తి చేశాం. దీన్ని ప్రపంచ సాంకేతిక సహకారంలో గణనీయ పురోగమనంగా పేర్కొనవచ్చు. ఈ భాండాగారంలో 16 దేశాల నుంచి 50కిపైగా దేశాల 'డిపిఐ'లున్నాయి. సమగ్రాభివృద్ధి శక్తిని సద్వినియోగం చేసుకునే దిశగా దక్షిణార్ధ గోళ దేశాలు వీటిని అనుసరించడమేగాక, తమదైన 'డిపిఐ'ల నిర్మాణం, వినియోగం కోసం ఈ భాండాగారాన్ని చక్కగా వాడుకోవాలి.

మన ఏకైక భూగోళం కోసం తక్షణ, శాశ్వత, సమాన మార్పు సృష్టి లక్ష్యంగా మనం ప్రతిష్టాత్మక, సమగ్రమైన లక్ష్యాలను అనుసరిస్తున్నాం. భూగోళ పరిరక్షణ, పేదరిక నిర్మూలన నడుమ మన ఎంపికకు ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనడం ఎలాగో 'ఎన్డీఎల్డీ' నిర్దేశిత 'హరిత ప్రగతి ఒప్పందం' వివరిస్తుంది. పరస్పర పూరకాలైన ఉపాధి–పర్యావరణ వ్యవస్థలు, వాతావరణ స్పృహతో వినియోగం, భూగోళ హిత ఉత్పాదనకు తగిన ప్రణాళికను సూచిస్తుంది. ఇక 2030 నాటికి ప్రపంచ పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రతిష్ఠాత్మక రీతిలో మూడు రెట్లు పెంచాలని కూడా జి20 తీర్మానం పిలుపునిచ్చింది. మరోవైపు ప్రపంచ జీవఇంధన కూటమి ఏర్పాటు, హరిత ఉదజని కోసం సమష్టి కృషి, పరిశుభ్ర, హరిత ప్రపంచ నిర్మాణంపై జి20 ఆదర్శాలు కాదనలేని నిజాలు. భారత్ అనాదిగా అనుసరిస్తున్న విలువలు ఇవే. అలాగే సుస్థిర జీవనం కోసం జీవనశైలి (లైఫ్) వంటివాటిద్వారా ప్రపంచం మన ప్రాచీన అనుసరణీయ సంప్రదాయాల ద్వారా ప్రయోజనం పొందవచ్చు.

ఉత్తరార్థ గోళ దేశాల నుంచి గణనీయ ఆర్థిక సహాయంతోపాటు సాంకేతిక చేయూతను కోరడం ద్వారా వాతావరణ న్యాయం–సమానత్వం విషయంలో మన నిబద్ధతను కూడా 'ఎన్డీఎల్డీ' నొక్కి చెప్పింది. కాగా, అభివృద్ధికి ఆర్థిక చేయూత పరిమాణంలో తొలిసారిగా ఆశించన మేర రెట్టింపు పెరుగుదల నమోదైంది. ఆ మేరకు ఈ సాయం బిలియన్ల స్థాయి నుంచి ట్రిలియన్ల స్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో వర్ధమాన దేశాలు 2030 నాటికి తమ దేశీయ ప్రగతి లక్ష్యాల (ఎన్డీసీ)ను సాధించడానికి 5.9 ట్రిలియన్ డాలర్లు అవసరమని జి20 అంగీకరించింది.

భారీ స్థాయిలో నిధుల సమీకరణ అవసరం దృష్ట్యా మెరుగైన, విస్తృత, ప్రభావశీల బహుపాక్షిక అభివృద్ధి బ్యాంకుల ప్రాముఖ్యాన్ని కూడా జి20 సుస్పష్టం చేసింది. అంతేకాకుండా ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలు చేపట్టాలన్న డిమాండ్ విషయంలోనూ భారత్ ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా ఐరాస భద్రత మండలి వంటి ప్రధానాంగాల పునర్నిర్మాణం మరింత సమాన ప్రపంచ క్రమాన్ని నిర్ధారిస్తుంది.

న్యూఢిల్లీ దేశాధినేతల తీర్మానం లింగ సమానత్వానికీ పెద్దపీట వేసింది. ఆ మేరకు ఇది వచ్చే ఏడాదికల్లా మహిళా సాధికారతపై ప్రత్యేక కార్యాచరణ బృందం ఏర్పాటు అవసరాన్ని నొక్కిచెప్పింది. భారత మహిళా రిజర్వేషన్ బిల్లు–2023 ద్వారా పార్లమెంటు, రాష్ట్ర శాసనసభలలో మూడింట ఒక వంతు స్థానాలను మహిళలకు కేటాయించడం ద్వారా మహిళా చోదక ప్రగతిపై భారత్ నిబద్ధతను జి20 ప్రతిబింబించింది.

విధానపరమైన సమన్వయం, విశ్వసనీయ వాణిజ్యం, ప్రతిష్టాత్మక వాతావరణ కార్యాచరణపై దృష్టి సారిస్తూ ఈ కీలక ప్రాధాన్యాలన్నిటా పరస్పర సహకార స్ఫూర్తిని 'ఎన్డీఎల్డీ' చాటిచెప్పింది. మన అధ్యక్షత సమయంలో జి20 ద్వారా 87 నిర్ణయాలు తీసుకోవడంతోపాటు 118 పత్రాలకు ఆమోదం సాధించడం గర్వించదగిన అంశం. మునుపటితో పోలిస్తే ఇదెంతో గణనీయమైన పెరుగుదల.

మన జి20 అధ్యక్షత సమయంలో భౌగోళిక–రాజకీయాంశాలు, ఆర్థికవృద్ధి–ప్రగతిపై వాటి ప్రభావం వగైరాలపైనా చర్చలకు భారత్ నాయకత్వం వహించింది. ఉగ్రవాదం, విచక్షణ రహితంగా పౌరుల ప్రాణాలు తీయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఉగ్రవాదాన్ని తుదముట్టించడమనే విధానంతోనే ఈ బెడదను నిర్మూలించడం సాధ్యమని స్పష్టం చేసింది. మనం శత్రుత్వం స్థానంలో మానవత్వాన్ని స్వీకరించాలి. ఆ మేరకు ఇది యుద్ధ యుగం కాదనే వాస్తవాన్ని పునరుద్ఘాటించాలి.

జి20 అధ్యక్ష బాధ్యతల సమయంలో భారత్ అసాధారణ విజయాలు సాధించడం నాకెంతో సంతోషం కలిగిస్తోంది: ఇది బహుపాక్షికతను పునరుజ్జీవింపజేసింది... దక్షిణార్ధ గోళ దేశాల గళాన్ని మరింతగా వినిపించింది... ప్రగతి సాధనకు ప్రాముఖ్యమిచ్చింది... అన్ని రంగాల్లోనూ మహిళా సాధికారత కోసం పోరాడింది.

ఈ నేపథ్యంలో భూగోళం పచ్చగా పరిఢవిల్లడంతోపాటు ప్రపంచ ప్రజానీకానికి శాంతి–శ్రేయస్సు దిశగా ఇప్పటివరకూ మనం సమష్టిగా చేసిన కృషి భవిష్యత్తులోనూ కొనసాగుతుందని విశ్వసిస్తూ జి20 అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్ దేశానికి అప్పగిస్తున్నాం.




# అవుకు రెండో టన్నెల్‌ను జాతికి అంకితం చేసిన సీఎం జగన్



అమరావతి, నవంబర్ 30: అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించిన అవుకు రెండో టన్నెల్‌ను ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అవుకు మండలం మెట్టుపల్లె సమీపంలో అవుకు రెండో టన్నెల్ ను జాతికి అంకితం చేసి పైలాన్ ను ఆవిష్కరించి రిజర్వాయర్ నుంచి అదనంగా 10,000 క్యూసెక్కులు వెరసి మొత్తం 20,000 క్యూసెక్కుల నీటిని అవుకు రిజర్వాయర్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి విడుదల చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 567 కోట్ల రూపాయలతో పూర్తి చేసిన రెండో సొరంగం పనుల ఫోటో ఎగ్జిబిషన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, జలవనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర రెడ్డి, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జలవనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్, జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బ్రిజేంద్రనాథ్ రెడ్డి, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, మార్క్ ఫెడ్ చైర్మన్ పి.పి.నాగిరెడ్డి, నంద్యాల జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ విజయ మనోహరి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్, తదితరులు వున్నారు.

# ఓటేసిన సినీ ప్రముఖులు



హైదరాబాద్, నవంబర్ 30: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతోంది. మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల పోలింగ్ గురువారం ఉదయం 7 గంటలకు మొదలైంది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కొనసాగనుంది. సమస్యాత్మక కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పోలింగ్ జరగనుంది. దీంతో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సామాన్యులే కాదు.. పోలింగ్ ప్రారంభమైన వెంటనే ఓటేసేందుకు పలువురు సినీ ప్రముఖులు కూడా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కుటుంబ సభ్యులతో కలిసి సమీపంలోని పోలింగ్ కేంద్రాల్లో క్యూలైన్లో నిలబడి ఓటు వేస్తున్నారు.

జూబ్లీహిల్స్ క్లబ్‌లో భార్య సురేఖతో కలిసి మెగాస్టార్ చిరంజీవి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇక జూనియర్ ఎన్టీఆర్ సైతం జూబ్లీహిల్స్‌లోని పీ ఓబుల్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రంలో తల్లి, భార్యతో కలిసి సామాన్యుడిలా క్యూలైన్‌లో నిలబడి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, జూబ్లీహిల్స్ క్లబ్‌లో నటుడు సుమంత్, బీఎస్ఎన్ఎల్ సెంటర్ పోలింగ్ బూత్ 153లో సినీ నటుడు అల్లు అర్జున్ ఓటు వేశారు. నటుడు వెంకటేశ్, ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, రాజమౌళి, తేజ, హీరో నితిన్, శ్రీకాంత్ తదితరులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ మేరకు ఫొటోలను సోషల్ మీడియాలో వేదికగా పంచుకున్నారు.



# ఓటు హక్కును వినియోగించుకున్నా బర్రెలక్క

కొల్లాపూర్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మర్రికల్ గ్రామంలోని బూత్ నెంబర్ 12లో ఆమె ఓటు వేశారు. కాగా, ఆమె కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలతో బర్రెలక్కకు ఈసీ సెక్యూరిటీ కూడా ఇచ్చింది. ఆ సెక్యూరిటీతోనే ఆమె పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు వేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బర్రెలక్క.. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఓటు వేసేందుకు అందరూ పోలింగ్ కేంద్రాలకు రావాలని కోరారు. ఇక ఈ ఎన్నికల్లో ఆమె నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు వీలుగా కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, ఎన్నికల ప్రచార సమయంలో ఆమెకు తీవ్ర బెదిరింపులు వచ్చాయి. శిరీష తమ్ముడిపై దాడి కూడా జరిగింది. బర్రెలక్కకు వచ్చిన ఆదరణ చూసి, ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలంటూ ఇతర పార్టీల అభ్యర్థులు ఆమెను బెదిరించారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించడంతో గన్‌మెన్లతో సెక్యూరిటీని కల్పించారు ఎన్నికల అధికారులు.

# ఓటు హక్కును వినియోగించుకున్న లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి



సిద్దిపేట నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూస్); సిద్దిపేట అసెంబ్లీ నియో జక వర్గంలోని పోలింగ్ బూత్. నం. 118 , ఆంబిటస్ విద్యాలయంలో ఓ టు హక్కును వినియోగించుకున్న లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మన పల్లి శ్రీనివాసు దంపతులు.

# ఓటు హక్కును వినియోగించుకున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



హైదరాబాద్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి నల్లు. మలక్ పేట సలీం నగర్ పోలింగ్ బూత్ 204 లో ఓటు వేశారు.ప్రపంచంలో భారత ప్రజాస్వామ్య వ్యవస్థ అద్భుతమైనదని, ఇతర దేశాలతో పోలిస్తే దేశంలో ఎన్నికలు గొప్పగా, పండుగలా జరుపుకుంటామని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు ఓటు వినియోగించుకోవాలని అన్నారు. తెలంగాణ శాసనసభకు జరుగుతున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్నట్లు నల్లు ఇంద్ర సేనా రెడ్డి చెప్పారు. ఓటు హక్కు విలువైనది, పవిత్రమైనదని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# జుబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, నవంబర్ 30: తెలంగాణ గడ్డ ఉద్యమాల గడ్డ, చైతన్యవంతమైన గడ్డ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పింక్ వేవ్ కనిపిస్తోందని అన్నారు. గురువారం జుబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ చరిత్ర సృష్టిస్తుందన్నారు. హ్యాట్రిక్ సీఎంగా సీఎం కేసీఆర్ చరిత్ర సృష్టిస్తారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు.

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులతోపాటు ఎమ్మెల్సీ కవిత అవిశ్రాంతంగా ప్రచారం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల తరపున భారీ ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

# వికసిత భారతం సంకల్ప యాత్రలో మహిళలే ప్రధాన భాగస్వాములు

న్యూఢిల్లీ, నవంబర్ 30: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇవాళ వికసిత భారతం సంకల్పయాత్ర లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా సంభాషించారు. ఈ సందర్భంగా ఆయన మహిళా కిసాన్ డ్రోన్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేవగఢ్ లోని ఎయిమ్స్ ప్రాంగణంలో 10,000వ జనౌషధి కేంద్రాన్ని ప్రధానమంత్రి జాతికి అంకితం చేశారు. దీంతోపాటు దేశవ్యాప్తంగా జనౌషధి కేంద్రాలను 10,000 నుంచి 20 వేలకు పెంచే కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు.

స్వయం సహాయ సంఘాల మహిళలకు డ్రోన్ల పంపిణీతోపాటు జనౌషధి కేంద్రాల సంఖ్యను 10 వేల నుంచి 25,000కు పెంచుతామని, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం సందర్భంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆనాటి హామీలు నేటి కార్యక్రమంతో నెరవేరాయి.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాకు చెందిన స్వయం సహాయ సంఘం సభ్యురాలు కొమ్మలపాటి రమనమ్మతో ప్రధాని ముచ్చటించారు. వ్యవసాయ అవసరాల కోసం డ్రోన్ వినియోగంపై తన శిక్షణ అనుభవాన్ని ఆమె శ్రీ మోదీతో పంచుకున్నారు. డ్రోన్ పైలట్ శిక్షణను తాను 12 రోజుల్లో పూర్తి చేసుకున్నట్టు రమణమ్మ ఆయనకు వివరించారు.

వ్యవసాయ పనుల్లో డ్రోన్ల వినియోగం వల్ల గ్రామాలలో ప్రభావంపై ఈ సందర్భంగా ప్రధానమంత్రి వాకబు చేశారు. దీనిపై ఆమె స్పందిస్తూ– నీటికి సంబంధించిన సమస్యల పరిష్కారంతోపాటు ఎంతో సమయం ఆదా అవుతున్నదని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి మాట్లాడుతూ.. భారతదేశంలో మహిళా శక్తిపై సందేహాలు వ్యక్తం చేసేవారికి వెంకట రమణమ్మ సామర్థ్యమే సమాధానమని నొక్కిచెప్పారు. వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం భవిష్యత్తులో మహిళా సాధికారతకు సంకేతంగా నిలుస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. అలాగే వికసిత భారతం సంకల్ప యాత్రలో మహిళల భాగస్వామ్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు.

# ఉద్రిక్తతల నడుమ సాగర్ నీటి విడుదల చేసిన ఏపీ అధికారులు

అమరావతి, నవంబర్ 30:సాగర్ కుడి కాలువ నుంచి ఏపీ అధికారులు కిందకు నీటిని విడుదల చేశారు. దాదాపు 2 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఒంగోలు చీఫ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు గేట్లను ఎత్తి వేశారు.

తాజా పరిస్థితుల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ సరిహద్దుల్లో పెద్ద సంఖ్యలో పోలీసులు మోహరించారు. మరోవైపు తెలంగాణ నుంచి వస్తున్న వాహనాలను ఏపీ పోలీసులు అడ్డుకుంటున్నారు. ఏపీ అడ్రస్ ఉన్న ఆధార్ కార్డు ఉంటేనే అనుమతిస్తున్నారు. ఇతర వాహనాలను వెనక్కి తిప్పి పంపిస్తున్నారు.

# కేంద్ర పథకాలకు రాష్ట్ర పథకాలుగా స్టిక్కర్లు వేసుకుని ప్రచారం

అమరావతి, నవంబర్ 30: ఆరోగ్య శ్రీకి సీఎం నిధులు ఇవ్వకపోవడం వల్ల ఆస్పత్రిలో సేవలు నిలిపివేస్తున్నారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర రథాన్ని దగ్గుబాటి పురంధేశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు.

కేంద్ర పథకాలకు రాష్ట్ర పథకాలుగా స్టిక్కర్లు వేసుకుని ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి తెలిపారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు ఐదు లక్షల రూపాయల వైద్య సాయం అందిస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి వాటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా చేస్తున్నామని కేంద్రం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రచారం చేస్తామని చెప్పారు. వికసిత్ భారత్ పేరుతో ఏపీలో 50 వ్యాన్లతో యాత్ర సాగుతుందన్నారు. ప్రజల కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాలు, సంక్షేమం గురించి ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఇళ్లు రాని వారు ఆ వ్యాన్ దగ్గరకు వెళ్లి అవసరమైన సమాచారం తెలుసుకోవచ్చన్నారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ ద్వారా పేదలకు ఐదు లక్షల రూపాయల వైద్య సాయం అందిస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి వాటిపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు.

# సుప్రీం కోర్టులో చంద్రబాబు ముందస్తు బెయిల్ విచారణ వాయిదా

న్యూఢిల్లీ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఫైబర్ నెట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముందస్తు బెయిల్ పిటీషన్‌పై విచారణ సుప్రీం కోర్టులో వాయిదా పడింది. డిసెంబర్ 12కు ఈ కేసుపై విచారణను ధర్మాసనం వాయిదా వేసింది. ఫైబర్ నెట్ కేసులో ముందస్తు బెయిల్‌పై సుప్రీంలో ఈరోజు (గురువారం) విచారణకు రాగా... జస్టిస్ అనిరుద్ బోస్, జస్టిస్ బేలా ఎం త్రివేదీలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. డిసెంబర్ 12 వరకు వరకూ చంద్రబాబుపై ఎలాంటి చర్యలూ తీసుకోకూడదని న్యాయస్థానం ఆదేశించింది. గతంలో జారీచేసిన ఆదేశాలు కొనసాగుతాయని సుప్రీం స్పష్టం చేసింది. స్కిల్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటీషన్‌పై తీర్పు రాస్తున్నామని న్యాయమూర్తి అనిరుద్ధ బోస్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 12లోపు స్కిల్ కేసులో తీర్పు వెలువడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ఓటుహక్కు వినియోగించుకున్న బండి సంజయ్



కరీంనగర్, నవంబర్ 30:(నేటి నిజం ప్రతినిధి) ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కలిసి బీజేపీ పార్టీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారన్నారు. ఆ రెండు పార్టీలపై ప్రజలకు విశ్వాసం లేదన్నారు.

వారికి ప్రజలు ఓట్లెయ్యరన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తనపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్ చేసి ఇంకా తెలంగాణ సెంటిమెంట్ ఏంది ?. తెలంగాణ, ఆంధ్ర ఫీలింగ్ తీసుకొచ్చే కేసీఆర్ అండ్ టీం రెచ్చగొట్టే యత్నం చేస్తోందన్నారు. నాగార్జునసాగర్ ఇష్యూ ఇప్పుడే ఎందుకు తెరపైకి వచ్చింది.... తెర వెనుక.. ఎవరున్నారు తెలుసునని.. కేసీఆర్‌వి ఫాల్స్ రాజకీయాలన్నారు.

# జంటనగరాల్లో ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ అభ్యర్థులు









హైదరాబాద్, నవంబర్ 30:జంట నగరాల్లో ఉన్న నియోజకవర్గాల బీఆర్ఎస్ అభ్యర్థులు గురువారం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కును వినియోగించుకున్నారు. యాఖత్ పురా నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్ రెడ్డి దంపతులు ఓటును వినియోగించుకోగా అంబర్‌పేటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గం శంభీపూర్ లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు కుత్బుల్లాపూర్ లోని సత్ జ్ఞాన్ స్కూల్లో ఎమ్మెల్యే వివేకానందా, ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని కార్మిక శాఖ కార్యాలయంలో బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్ ఓటును వినియోగించుకున్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ నాట్కో స్కూల్ లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపినాథ్ ఓటును వేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని బౌద్ధనగర్ డివిజన్‌లో పోలింగ్ బూత్ లో ఓటింగ్ సరళిని డిప్యూటీ స్పీకర్, బీ ఆర్ ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ పరిశీలించారు.



# ఓటు హక్కు వినియోగించుకున్న బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): బి.ఆర్.ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు తన స్వగ్రామమైన కోనరావుపేట మండలంలోని మల్కపేట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రి, లక్ష్మీ నరసింహా రావు తండ్రి ఆనంద రావు , కరీంనగర్ డైరీ చైర్మన్ రాజేశ్వర్ రావు , చల్మెడ కుటుంబ సభ్యులు తమ తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలు ఓటు అనేది వజ్రాయుధ మని, ముందుకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

# ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ఎస్పీ. అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా గురువారం సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ లోని జిల్లా ఉన్నత పాఠశాలలో 116 పోలింగ్ కేంద్రంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఓటు హక్కువినియోగించుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూజిల్లా పరిధిలో ఓటు హక్కు ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ప్రజాస్వామ్యానికి ఓటుహక్కు వజ్రాయుధం అని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి అన్ని భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

# రాజన్నను దర్శించుకున్న బి ఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని గురువారం ఉదయం బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహా రావు దర్శించుకున్నారు.

కుటుంబ సభ్యులతో కలసి ఆలయానికి వెళ్లిన చల్మెడ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# కుటుంబసమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్న చీఫ్ రేవంత్ రెడ్డి



వికారాబాద్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);టీ పీ సీ సీ చీఫ్ రేవంత్ రెడ్డి కుటుంబసమేతంగా వెళ్లి కొడంగల్‌లోని జెడ్‌పీహెచ్‌ఎస్ బాయ్స్ సౌత్ వింగ్ పోలింగ్ బూత్‌లో (బూత్ నెం.237) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేసే ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు సమయస్ఫూర్తి ఉన్నవారన్నారు. అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారం రావాలంటే ప్రజలకు ఆమోదయోగ్యమైన ప్రభుత్వం రావాలన్నారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలపై సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ ఏర్పాటు చేసే ప్రభుత్వంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఎలాంటి కుట్రలకు లొంగిపోవద్దని తెలంగాణలో 4 కోట్ల ప్రజలకు రేవంత్ విజ్ఞప్తి చేశారు.

# కాశీ తమిళ సంగమం ఫేజ్ 2 డిసెంబర్ 17 నుండి 30 వరకు

న్యూఢిల్లీ, నవంబర్ 30:మద్రాస్ వారి రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను ప్రారంభించడంతో కాశీ తమిళ సంగమం 2వ దశకు వేదిక సిద్ధమైంది. ఈ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమం యొక్క రెండవ ఎడిషన్ డిసెంబర్ 17వ తేదీ నుండి మొదటి రోజున నిర్వహించాలని ప్రతిపాదించబడింది. పవిత్ర తమిళ మార్గళీ మాసం, డిసెంబర్ 30, 2023 వరకు. దీని మొదటి ఎడిషన్ లాగా, ఈ కార్యక్రమం వారణాసి మరియు తమిళనాడు మధ్య సజీవ బంధాలను పునరుద్ధరించే లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్లాలని ప్రతిపాదిస్తుంది - పురాతన భారతదేశంలోని రెండు ముఖ్యమైన అభ్యాస మరియు సంస్కృతి కేంద్రాలు. ప్రజలు జీవితంలోని వివిధ రంగాలలో కనెక్ట్ అవుతారు.

ఐయూ యొక్క 2వ దశలో తమిళనాడు మరియు పుదుచ్చేరి నుండి సుమారు 1400 మంది ప్రయాణ సమయంతో సహా వారణాసి, ప్రయాగ్‌రాజ్ మరియు అయోధ్యకు 8 రోజుల లీనమయ్యే పర్యటన కోసం రైలులో ప్రయాణించాలని ప్రతిపాదించబడింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు ఒ చేతివృత్తులవారు, వ్యాపారులు ఒ వ్యాపారవేత్తలు, మతపరమైన, రచయితలు, వృత్తినిపుణులతో కూడిన 200 మంది చొప్పున 7 గ్రూపులుగా విభజించారు. ప్రతి సమూహానికి ఒక పవిత్ర నది (గంగ, యమునా, సరస్వతి, సింధు, నర్మద, గోదావరి మరియు కావేరి) పేరు పెట్టబడుతుంది.

## ఓటు హక్కు ను వినియోగించుకున్నా డిప్యూటీ స్పీకర్ పద్మారావు

హైదరాబాద్ నవంబర్ 30 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); తెలంగాణ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ నియోజకవర్గ బీ ఆర్ ఎస్ అభ్యర్థి తీగుళ్ళ పద్మారావు గౌడ్ గురువారం సికింద్రాబాద్ లోని మోండా మార్కెట్ ఇస్లామియా స్కూల్ లో తన ఓటు హక్కు ను వినియోగించుకున్నారు. తన కుటుంబాసభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కు ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును వివేకంతో వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

# ఏడు కిలోమీటర్లు నడిచి వచ్చి.. ఓట్లేసిన గిరిజనులు

జైనూర్, నవంబర్ 30: కొమరం భీం జిల్లా జైనూర్ మండలంలోని దబోలి పంచాయతీలో గల అటవీ ప్రాంతంలోని మారుమూల ఆదివాసి గిరిజన గ్రామాలైన లొద్దిగూడ గ్రామాల ప్రజలు ప్రతిసారి జరిగే ఎన్నికల పోలింగ్ రోజున ఓట్లు వేయడానికి దాదాపు ఏడు కిలోమీటర్ల వరకు కాలినడకన వచ్చి ఇబ్బందులు పడుతూ ఓట్లు వేస్తున్నారు. ఇవాళ జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి లొద్దిగూడ గ్రామాలకు చెందిన ఆదివాసి ఓటర్లు కాలినడకన వచ్చి ఓటు హక్కువినియోగించుకున్నారు.

ఎన్ని ప్రభుత్వాలు మారినా లొద్దిగూడ గోండు, కోలం గూడలకు రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామాల ఆదివాసి ఓటర్లు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆశీర్వాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు కృషితో షేకు కూడా నుండి లొద్దిగూడ ఘాట్ ప్రాంతం వరకు మట్టి రోడ్డు ఎత్తు ప్రాంతాలను వెడల్పు పనులు చేయించి కనీసం నడవడానికి సౌకర్యం కలిగిందని, వాహనాలు వెళ్లడం సాధ్యం కాదని వారు తెలిపారు. తమ గ్రామాలకు అధికారులు పనుల నిమిత్తం రావాలన్నా కాలి నడకన ఇబ్బందులు పడుతూ వస్తారని తెలిపారు. ఇప్పటికైనా కొత్తగా ఏర్పడే ప్రభుత్వ హయాంలోనైనా రోడ్డు సౌకర్యం కల్పించాలని తమ ఇబ్బందుల ను తొలగించాలని ఆదివాసి ఓటర్లు కోరారు.

# IFFI 54కి తెర పడింది, సినిమా ఆనందం కొనసాగుతుంది




న్యూఢిల్లీ, నవంబర్ 30:సూర్యుడు అరేబియా సముద్రం మీద అస్తమిస్తున్నప్పుడు, ఇక్కడ ఉన్న పనాజీ యొక్క సుందరమైన తీరంలో బంగారు కాంతిని ప్రసరింపజేస్తూ, అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ఆఫ్ ఇండియా యొక్క 54వ ఎడిషన్ కూడా ముగుస్తుంది, సినిమా శ్రేష్ఠత మరియు మనోజ్ఞతను ప్రతిధ్వనించే తీరాలను ప్రతిధ్వనిస్తుంది. చలనచిత్ర మరియు వినోద రంగానికి చెందిన ప్రముఖులు, చిత్రనిర్మాతలు మరియు ప్రముఖుల సముదాయం హాజరైన అబ్బురపరిచే ముగింపు వేడుకతో ఉత్సవం దాని క్రెసెండోకు చేరుకుంది.

54వ IFFI లో అబ్బాస్ అమిని దర్శకత్వం వహించిన పర్షియన్ చిత్రం ఎండ్‌లెస్ బోర్డర్స్ ఉత్తమ చిత్రంగా గోల్డెన్ పీకాక్ అవార్డును అందుకుంది. భౌతిక సరిహద్దుల కంటే మీరు మీపై విధించుకునే భావోద్వేగ మరియు నైతిక సరిహద్దులు చాలా క్లిష్టంగా ఉంటాయని జ్యూరీ గమనించింది.

బల్గేరియన్ దర్శకుడు స్టీఫన్ కొమందరేవ్ తన చిత్రం బ్లాగాస్ లెసన్స్ కోసం ఉత్తమ దర్శకుడిగా సిల్వర్ పీకాక్‌తో సత్కరించబడ్డాడు. స్టీఫన్ కొమందరేవ్ తన లక్ష్యాలను సాధించాలని నిర్ణయించుకునే ఒక మహిళ పాత్ర ద్వారా శక్తివంతమైన మరియుగ్రాఫ్యుంతికరమైన పాఠాన్ని చెప్పాడు మరియు అలా చేయడంలో ఆమె విలువలతో రాజీ పడుతుందని జ్యూరీ యొక్క ఉల్లేఖనాన్ని చదివారు. బ్లాగాస్ లెసన్స్‌కు చెందిన ఎలి స్కోర్చెవా మరియు రోజల్యా అబ్గారియన్ నటీమణులు స్టీఫన్ కొమందరేవ్ తరపున అవార్డును అందుకున్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, టర్కీ దర్శకుడు నూరీ సెలాన్, ఆస్ట్రేలియన్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ హెలెన్ లీక్, సినీ నటి ఈషా గుప్తా ప్రతిష్టాత్మకమైన బహుమతిని అందజేశారు.

పూరియా రహిమి సామ్ ఉత్తమ నటుడిగా (పురుషుడు) రజత పీకాక్ అవార్డును అందుకుంది.

అబ్బాస్ అమిని దర్శకత్వం వహించిన పర్షియన్ చిత్రం ఎండ్‌లెస్ బోర్డర్స్‌లో తన పాత్రకు ఇరానియన్ నటుడు పౌరియా రహిమి సామ్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. జ్యూరీ నటుడిని "నటన యొక్క గొప్పతనానికి మరియు అతని భాగస్వాములు, పిల్లలు మరియు పెద్దలతో సవాలుగా ఉన్న షూటింగ్ పరిస్థితులలో సంభాషించడానికి" ఎంపిక చేసింది.

ఫ్రెంచ్ నటి, మెలానీ థియరీ పార్టీ ఆఫ్ ఫూల్స్ చిత్రంలో తన శ్రేష్టమైన పాత్రకు ఉత్తమ నటిగా (స్త్రీ) సిల్వర్ పీకాక్‌తో సత్కరించారు. తన పాత్ర యొక్క క్రేజీ జర్నీలో ఎదురయ్యే ఆశ నుండి నిరాశ వరకు అన్ని భావోద్వేగాలను నటి యొక్క వ్యక్తీకరణల పరిధి సూక్ష్మంగా ప్రేక్షకులకు ఇస్తుందని జ్యూరీ వ్యాఖ్యానించింది. ఇన్‌స్టిట్యూట్ ఫ్రాంకైస్‌కు చెందిన జూలియట్ గ్రాండ్‌మాంట్ గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, చిత్ర నిర్మాత జెరోమ్ పైలార్డ్ మరియు మెలానీ థియరీ తరపున నేపథ్య గాయకుడు మరియు ఫిల్మ్ స్కోర్ కంపోజర్ హరిహరన్ నుండి అవార్డును అందుకున్నారు.

భారతీయ చిత్రనిర్మాత రిషబ్ శెట్టి తన విమర్శకుల ప్రశంసలు పొందిన చిత్రం కాంతారా కోసం ప్రత్యేక జ్యూరీ అవార్డును పొందారు. చాలా ముఖ్యమైన కథను అందించడంలో దర్శకుడి సామర్థ్యాన్ని జ్యూరీ ప్రశంసించింది. "చిత్రం, దాని స్వంత అడవి రాక్షసుల సంస్కృతిలో పాతుకుపోయినప్పటికీ, సంస్కృతి మరియు సామాజిక స్థితితో సంబంధం లేకుండా ప్రేక్షకులకు చేరువైంది" అని జ్యూరీ పేర్కొంది. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, స్పానిష్ సినిమాటోగ్రాఫర్ జోస్ లూయిస్ అల్కైన్ మరియు ఫ్రెంచ్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ ఒ ఎఈఈఎ జ్యూరీ సభ్యురాలు కేథరీన్ డస్సార్ట్ ఈ అవార్డును అందజేశారు.

సిరియన్ అరబ్ రిపబ్లిక్‌కు చెందిన ప్రామిసింగ్ ఫిల్మ్ మేకర్ రెగర్ ఆజాద్ కయా, వెన్ ద సీడ్లింగ్స్ గ్రో చిత్రానికి గానూ దర్శకుడి ఉత్తమ తొలి చిత్రంగా అవార్డు అందుకున్నారు. చిన్న చిన్న సంఘటనల ద్వారా తండ్రి, కూతురు మరియు తప్పిపోయిన అబ్బాయి జీవితంలోని ఒక రోజుని మనకు చూపించడంలో విజయం సాధించిన కథను ఈ చిత్రం వివరిస్తుందని జ్యూరీ పేర్కొంది.

ఆంథోనీ చెన్ దర్శకత్వం వహించిన ఫ్రెంచ్, బ్రిటీష్ మరియు గ్రీక్ కో-ప్రొడక్షన్ డ్రిఫ్ట్ ప్రతిష్టాత్మకమైన ICFT-UNESCO గాంధీ మెడల్‌ను అందుకుంది. జీవితంలోని అనిశ్చితిలో కూరుకుపోవడం ఊహించని బంధాలకు ఎలా దారితీస్తుందో చిత్రీకరించిన ఈ చిత్రం జ్యూరీ ఎంపికను గమనించిన ఆశ మరియు స్థితిస్థాపకత యొక్క రేఖలను గీస్తుంది.

ప్రముఖ హాలీవుడ్ నటుడు మరియు నిర్మాత మైఖేల్ డగ్లస్ ముగింపు వేడుకలో ప్రతిష్టాత్మక సత్యజిత్ రే లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ అవార్డును అందుకున్న మైఖేల్ డగ్లస్ మాట్లాడుతూ, "ఈ అవార్డును అందుకోవడం గొప్ప గౌరవం, ఇది కెరీర్‌లో సాధించిన ఘనత. అవార్డు గురించి విన్నప్పుడు, మా కుటుంబం మరియు నేను ఉప్పొంగిపోయాము.

# ఆయుర్వేదిక్ సిరప్ తాగి.. ఐదుగురు మృతి

అహ్మదాబాద్, నవంబర్ 30: ఆయుర్వేదిక్ సిరప్ తాగి ఐదుగురు మరణించారు. మరి కొందరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ ఆయుర్వేదిక్ టానిక్‌లో విషపూరిత మిథైల్ ఆల్కహాల్ ఉన్నట్లు గుర్తించారు. గుజరాత్‌లోని ఖేడా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బిలోదర గ్రామానికి చెందిన ఒక షాపు వ్యక్తి 'కల్మేఘాసవ్ అసవ అరిష్టా' అన్న బ్రాండ్‌తో కూడిన ఆయుర్వేద టానిక్‌ను సుమారు 50 మందికి విక్రయించాడు. రెండు రోజుల్లో ఈ సిరప్ తాగి ఐదుగురు మరణించారు. తీవ్ర అస్వస్థతతో ఆసుపత్రి పాలైన మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు.

కాగా, ఈ విషయం తెలిసిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఆయుర్వేదిక్ సిరప్ అమ్మిన వ్యక్తితోపాటు మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఆయుర్వేద టానిక్ తాగిన గ్రామానికి చెందిన ఒక వ్యక్తి రక్త నమూనాలను పరిశీలించినట్లు తెలిపారు. విషపూరితమైన మిథైల్ ఆల్కహాల్ ఆ సిరప్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# ఓటు వేసిన డిపిఆర్ఓ మామిండ్ల దశరథం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): కోనారావు పేట మండలం కొలనూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం నెంబర్ 259 లో గురువారం పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం తన ఓటు హక్కునువినియోగించుకున్నారు. ఓటు హక్కు మాత్రమే కాదని బాధ్యతగా ప్రతి ఓటరు వినియోగించుకోవాలని కోరారు

# జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



## -పటిష్ట బందోబస్తు మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ కి తరలింపు

## -జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 30:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్లజిల్లాలోని అన్ని నియోజక వర్గాల్లో గురువారం పోలింగ్ ప్రకియప్రశాంత వాతావరణంలో ముగిసిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు..

ఓటింగ్ లో పాల్గొన్న ప్రజలంతా కూడా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, జిల్లాలో ఏ ప్రాంతంలో కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖ సమన్వయంతో సమార్ధవంతంగా అధికారులు సిబ్బంది విధులు నిర్వహించారన్నారు.

పోలింగ్ పూర్తయిన ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి ఓటింగ్ సామాగ్రి మొత్తం విఆర్కే స్ట్రాంగ్ రూమ్ కు తరలించి అక్కడ కేంద్ర బలగాలతో పటిస్ట భద్రతను ఏర్పాటు చేశామన్నారు.. అంతకుముందు ఎస్పీ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు..

# భారత దేశంలో దైవ భక్తిని పెంపొందించడంతోపాటు విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి క్రుషి



హైదరాబాద్, నవంబర్ 30:భారత దేశంలో దైవ భక్తిని పెంపొందించడంతోపాటు విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధికి తన వంతు సహకారమందిస్తామని ప్రముఖ దైవ సందేశకులు డాక్టర్ డబ్ల్యూఎఫ్ కుమయి అన్నారు. రక్షణ టీవీ సీఈఓ బ్రదర్ బెన్‌హర్ జక్కుల, డైరెక్టర్ ప్రసాద్ చౌదరిల ఆధ్వర్యంలో గ్లోబర్ క్రుసేడ్ ఇండియా పేరుతో వెస్టిన్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏపీ, తెలంగాణలో సీజీకే ఆధ్వర్యంలో పలు సదస్సులు నిర్వహించామని, ఈ సదస్సులకు హాజరు కాలేని వ్యాపారవేత్తలు, ప్రొఫెషనల్స్ కోసం ప్రత్యేక సదస్సును నిర్వహించామని తెలిపారు. సీజీకే ఆధ్వర్యంలో పేద వారికి విద్య, వైద్యం అందించడం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

దైవ సందేశాన్ని నిజ జీవితంలో అమలు పరుచుకోవడం ద్వారా ప్రతి ఒక్కరూ విజేతలుగా మారవచ్చని అన్నారు. రెవరెండ్ వై మోహన్‌బాబు, రెవరెండ్ ఎడ్వర్డ్ రోసీ, రెవరెండ్ ఏనుపాదం, రెవరెండ్ దీవెన కుమార్‌లు మాట్లాడుతూ 82 ఏళ్ల వయసు ఉన్నప్పటికీ డాక్టర్ డబ్ల్యూఎఫ్ కుమయి యువకుడి వలే నిరంతరం దైవ సేవలో తరిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో క్రిస్టియన్ మేధావులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

సాహితీ కిరణం ఆహ్వానము
కీ॥శే॥శ్రీమతి పాత్తూరి అన్నపూర్ణమ్మ శతజయంతి మహోత్సవం
శ్రీమతి కుమ్మమూరి సుబ్బాయమ్మ రచించిన 'అమ్మ అన్నపూర్ణమ్మ' (సంక్షిప్త జీవిత చరిత్ర)-ఆవిష్కరణ
ప్రజాభిమాన పాత్రికేయులు డా॥పొత్తూరి వెంకటేశ్వరరావు(ప్రముఖుల వ్యాసాలు)
ఆవిష్కరణ
కృతిస్వీకర్త : శ్రీ పొత్తూరి ప్రేమ గోపాలకృష్ణ
ముఖ్యఅతిథి : శ్రీ ఎ.ఎల్.కిస్మత్ కుమార్ విశ్రాంత ఆం.ప్ర. సమాచారశాఖ సంచాలకులు
సభాధ్యక్షులు : శ్రీ బైసదేవదాసు సంపాదకులు-నేటినిజం దినపత్రిక
గౌరవ అతిథి : శ్రీ గుడిబండి వెంకటరెడ్డి గౌరవ సంపాదకులు-సాహితీకిరణం
విశిష్ట అతిథి : శ్రీ విడదల సాంబశివరావు అధ్యక్షులు - విడదల నీహారిక ఫౌండేషన్
ప్రత్యేక ఆహ్వానితులు : శ్రీమతి కొసరాజు సామ్రాజ్యం విశ్రాంత ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆం.ప్ర. స్త్రీ శిశుసంక్షేమ శాఖ
ఆత్మీయ అతిథులు : శ్రీ వల్లూరు శివకోటేశ్వరరాజు విశ్రాంత జనరల్ మేనేజర్-ఆంధ్రాబ్యాంక్; శ్రీ వడలి రాధాకృష్ణ కథారచయిత
సభాప్రారంభం : శ్రీ పొత్తూరి సుబ్బారావు సంపాదకులు, సాహితీకిరణం
సభా నిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు సలహాదారులు, సాహితీకిరణం
శుభాకాంక్షలు : శ్రీ ఎన్వీ రఘువీర్ ప్రతాప్ కవి,రచయిత; శ్రీ సయ్యద్ జానీబాషా ఆర్గనైజింగ్ సెక్రటరీ-విడదల నీహారిక ఫౌండేషన్
అతిథి సత్కారం : శ్రీ పి.వి.ఎల్.నరసింహారావు సాహిత్యాభిమాని
తేది:03.12.2023 ఆదివారం ఉదయం 10.00 గంటలకు
వేదిక: సాహితీకిరణం బ్రాంచి కార్యాలయం ( ఇం.నెం.107-1-331, వార్డ్ సచివాలయం ఎదురుగా ) పొత్తూరు, గుంటూరు
తూములూరి రాజేంద్రప్రసాద్ సలహాదారులు - సాహితీకిరణం
పొత్తూరి జయలక్ష్మి మేనేజర్-సాహితీకిరణం
'మాతృదేవోభవ' కవిసమ్మేళనం
కవిసమ్మేళనం నిర్వహణ : శ్రీ వి.యస్.ఆర్.యస్. సోమయాజులు కవి, వ్యాఖ్యాత
కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు/కవయిత్రులు
శ్రీ యస్.యం.సుభాని-గుంటూరు,
శ్రీ జమదగ్ని-గుంటూరు,
శ్రీ వి.యస్.వి.ప్రసాద్-తణుకు
శ్రీ తంగిరాల చక్రవర్తి-హైదరాబాద్,
శ్రీ గజవెల్లి - హైదరాబాద్,
శ్రీపొత్తూరి సీతారామరాజు-కాకినాడ
శ్రీ ఉప్పల రాధాకృష్ణ-హైదరాబాద్,
శ్రీ బి.కుమార్‌రాజు-గుంటూరు,
శ్రీయం.బాలగంగాధరయ్య-హైదరాబాద్,
శ్రీ జి.నాసరయ్య-గుంటూరు,
శ్రీ షేక్ సుభాని-సత్తెనపల్లి,
శ్రీ కంచర్ల విజయభాస్కర్-కావలి
శ్రీచివుకుల వాసుదేవ మూర్తి-విజయవాడ,
శ్రీ పి.శ్రీధర్-వరంగల్
శ్రీమతి తాటికోల పద్మావతి-గుంటూరు,
శ్రీమతి వంగీపురపు శారదాదేవి-గుంటూరు,
శ్రీమతి పోతురాజు దుర్గ-గుంటూరు,
శ్రీమతి చుండూరు శేషుమాంబ-గుంటూరు,
శ్రీమతి పింగళి భాగ్యలక్ష్మి-గుంటూరు,
విరామ సమయంలో సినీసంగీతం - శ్రీ పొత్తూరి మురళీకృష్ణ, పద్మ

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.